క్లుప్తంగా

అమ్మవారికి కంఠాభరణం సమర్పణ



అమ్మవారికి ఆభరణం అలంకరించిన దృశ్యం

కడియం: దుళ్ల మార్కెట్ సెంటర్‌లోని శారదా అమ్మవారికి గ్రామానికి చెందిన రైతు చిట్టూరి వెంకట్రావు, సూర్యచంద్ర ప్రభావతి దంపతులు తమ కుమార్తె వల్లూరి సూర్యకాంతం జ్ఞాపకార్థం స్వర్ణ కంఠాభరణాన్ని సమర్పించారు. శనివారం విజయదశమి సందర్భంగా సుమారు మూడు లక్షల రూపాయల విలువైన అయిదున్నర కాసుల ఈ ఆభరణాన్ని వారి కుమారుడు చిట్టూరి వెంకన్నచౌదరి అమ్మవారికి ఆలయ అర్చకుడికి అందజేశారు. ఆయన అమ్మవారికి అలంకరించారు.

రూ.40వేలు పలికిన లడ్డూ

కడియం: మండల కేంద్రమైన కడియంలోని దేవీచౌక్‌లో అమ్మవారి వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాద్ రూ.40వేలు పలికింది. గ్రామానికి చెందిన కందుకూరి వెంకన్న వేలంలో లడ్డూను దక్కించుకున్నారు. కాగా నేతి నానాజీ స్వీట్ స్టాల్ వారు ఈ లడ్డూ ప్రసాదాన్ని అమ్మవారికి బహూకరించారు.

ఘనంగా పాస్టర్ల దినోత్సవం

కడియం: దామిరెడ్డిపల్లి బైబిలు మిషన్ మహిమ మందిరంలో ప్రపంచ పాస్టర్ల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ డీ రత్నరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సంఘస్తులు, యువత పాల్గొన్నారు.

సాయిబాబా మరణానికి కేంద్రమే బాధ్యత వహించాలి

రాజమహేంద్రవరం రూరల్: ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఆకుల వెంకట రమణ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సాయిబాబా మరణవార్త పలు విప్లవ ప్రజా సంఘాలకు తీవ్ర విషాదానికి గురి చేసిందన్నారు. ఢిల్లీ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా విద్యార్థులకు పాఠాలను బోధిస్తూనే దేశంలో న్యాయం, నూతన సమాజం కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా పదేళ్లు నాగపూర్ జైల్‌లో పెట్టి, క్రూరంగా కేంద్ర ప్రభుత్వం ఆయనను బాధించిందన్నారు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించిపోవడానికి మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన దుర్మార్గ పద్ధతులే కారణమన్నారు. ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణానికి నివాళులర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు, సహచరులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని ఆకుల వెంకటరమణ తెలిపారు.

కష్టాలను తట్టుకుని నిలబడాలి

రాజమహేంద్రవరం సిటీ: ప్రపంచంలో ప్రస్తుతం అల్లకల్లోల, పరిస్థితులు నెలకొన్నాయని, ప్రతి మనిషి కష్టాలను తట్టుకుని ధైర్యంగా నిలబడాలని యెహోవా సాక్షుల ప్రతినిధి జి.సజయ్ అన్నారు. రాజమహేంద్రవరం నగరంలోని ఓ హోటల్‌లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 'యెహోవా సాక్షులు 2024 మంచివార్త ప్రకటించండి' కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సజయ్ మాట్లాడుతూ 'కంగారుపెట్టే వార్తలు విన్నప్పుడు మనం ఎందుకు భయపడం' అనే అంశంపై దైవిక సూత్రాల ఆధారంగా చేపట్టిన ప్రసంగాలు, వీడియోలు, ఇంటర్వ్యూలు ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

రాజమహేంద్రవరం రూరల్: దసరా పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి- ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కాతేరు మల్లయ్యపేటలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచా రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- రాజమండ్రి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు శేఖర్‌బాబు, సూర్యకుమారి, రాణి, సంధ్యారా ణి, వేణు మాధురి, పీఎస్ ఎన్ మూర్తి, లక్ష్మీనారాయ ణ, విజయ్, లోహిత తదితరులు పాల్గొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

కంబాల చెరువు(రాజమహేంద్రవరం): తీసుకున్న అప్పు తిరిగి చెల్లించమని అడిగినందుకు తనను, తన తండ్రిని రాజమహేంద్రవరం నగరానికి చెందిన నల్లూరి వెంకట శ్రీనివాస్, అతని కుమారుడు అభిలాష్ అనే వ్యక్తులు దాడి చేశారని కాజా కావ్య ఆదివారం రాత్రి ప్రకాష్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2021లో తాను అభిలాష్‌కు రూ.3లక్షలు అప్పు ఇచ్చానని, అప్పటి నుంచి సొమ్ములు తిరిగి ఇవ్వకుండా తిప్పుతున్నట్టు ఆమె చెప్పింది. విజయవాడ కుంచరపల్లికి చెందిన కావ్య ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటూ ఇవెంట్స్ యాంకర్‌గా పని చేస్తోంది. ఆదివారం తాడిపాకలో ఈవెంట్‌కి వెళ్లి హైదరాబాద్ తిరుగు ప్రయాణంలో అప్పు అడిగేందుకు తన తండ్రిని తీసుకుని రాజమహేంద్రవరంలో ఏవీ అప్పారావు రోడ్డులో తోట రాముడు నగర్‌లో నివాసం ఉండే శ్రీనివాస్ ఇంటికి వెళ్లింది. అప్పు తిరిగి ఇవ్వమని అడగా ఇరువురి మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో శ్రీనివాస్ కావ్య తండ్రిని కొట్టారు. అడ్డు వెళ్లిన తనను కొట్టినట్లు ఫిర్యాదుతో చెప్పింది. ఈ మేరకు ప్రకాష్‌నగర్ పోలీసు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



చిల్డ్రన్స్ పార్క్‌లో ఏర్పాటు చేసిన గ్లోబ్



అంకెల పజిల్



ప్లే ఎక్విప్‌మెంట్ జోన్



పెన్సిల్ వాల్

పార్క్ ప్రారంభమెప్పుడో

- పనులు పూర్తయినా అందుబాటులోకి రాని చిల్డ్రన్స్ పార్కు
- రూ.1.98 కోట్లతో నిర్మాణం
- పాలకులు, అధికారుల నిర్లక్ష్యం
- అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రాజమహేంద్రవరం సిటీ: పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా పార్క్ ప్రారంభించకపోవడంతో నగర ప్రజలు విస్తుపోతున్నారు. పార్క్‌లో పిల్లలు ఆడుకునేందుకు అన్ని రకాల ఆట వస్తులు ఏర్పాటు చేసినా వినియోగంలో లేకపోవడంతో అసహనానికి గురవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజమహేంద్రవరం లాలాచెరువు జాతీయ రహదారి పక్కన భారత్ పెట్రోల్ బంకును ఆనుకుని ఉన్న ఈ స్థలంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు రూ.1.98 కోట్ల వ్యయంతో ప్రత్యేకంగా పార్కును సిద్ధం చేసింది. నిర్మాణం పూర్తయి నెలలు కావస్తోంది. కానీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఇది పాలకులు, అధికారుల నిర్లక్ష్యమో నిర్లిప్తతతో అర్థం కావడం లేదని నగర ప్రజలు వాపోతున్నారు. పూర్తయిన అభివృద్ధి పనులను ప్రజలకు అందుబాటులోనికి తీసుకుని వస్తే అందరికీ ఆమోదయోగ్యమైనప్పటికీ ప్రారంభించడానికి అధికారులు మీనమేసాలు లెక్కిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..



డ్రోన్ ద్వారా తీసిన పార్కు చిత్రం

అన్ని విషయాలు తెలియజేస్తూ..

చిన్నారులకు ఆహ్లాదం వినోదం, విజ్ఞాన వికాసాన్ని అందించేందుకు రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా), నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో కోటి 98 లక్షల రూపాలయలతో చిల్డ్రన్స్ పార్క్ నిర్మించారు. ఈ పార్కులో పర్యావరణ సమతుల్యాన్ని పాటిస్తూ అనేక ఆధునిక కార్యక్రమాలు చేపట్టింది. స్థానికులు అభ్యర్థన మేరకు జాతీయ దినోత్సవాలైన, రిపబ్లిక్ డే, స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండా ఆవిష్కరణకు జాతీయ జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చిన్నారులకు సైకిల్ ట్రాక్, చిల్డ్రన్ ప్లే ఎక్విప్మెంట్ జోన్, పెన్సిల్‌వాల్, స్ప్రింగ్ టు గెదర్(తండ్రి కొడుకులు ఒకేసారి ఊగే ఊయల)చిన్నారులకు తల్లిపాలు అందించేందుకు మదర్ ఫీడింగ్ రూమ్, విజ్ఞాన దాయక చిత్రాల ప్రదర్శనలకు అవసరమైన స్క్రీన్, సముద్రం ఒడ్డున ఉండే ఫీల్ కలిగించే బీచ్‌ను పోలిన ప్రదేశం(సేండ్ జోన్) పర్యావరణ హితంగా గ్రీనరీ, ప్రత్యేక ఆకర్షణగా మూడు ఆర్‌లు, స్టోరీ టెల్లింగ్ (చిన్నారులకు ఒక వ్యక్తి అక్కడి స్టోరీ చెప్పేలా ఏర్పాటు) 50 లైట్లు (ఏ నుంచి జెడ్ వరకు తెలియజేసే లైట్లు) ఒకటి నుంచి వంద వరకూ అంకెలు గల టేబుల్, పలు రకాల పజిల్స్, ప్రపంచాన్ని తెలియజేసే గ్లోబ్, లూడో, చదరంగం, షేడ్ సిటింగ్, జిగ్ జాగ్ సిటింగ్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. నగర ప్రజలకు వినూత్న రీతిలో చిన్నారులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచేందుకు చిల్డ్రన్స్ పార్క్ నిర్మాణం చేపట్టారు.



చిల్డ్రన్ పార్కు ముఖ ద్వారం

చిన్నారులకు విజ్ఞానం

జిల్లా వ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా ఈ పార్కును లాలాచెరువులో సిద్ధం చేశారు. చిన్నారులు అడుగు పెడితే చాలు విజ్ఞానంతో బయటకు వెళ్లాలనే సంకల్పంతో ప్రత్యేకంగా తయారు చేసిన పార్కు ప్రారంభించక పోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్క్‌ను ప్రారంభించుంటే దసరా సెలవుల్లో పిల్లలకు ఎంతగానో ఉపయోగపడేదని చెబుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

ఈ విషయమై నగర పాలకసంస్థ ఇంజినీరింగ్ అధికారి ఆలీని వివరణ కోరగా త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

ఎందుకు ఆలస్యం చేస్తున్నారో..



పార్కు నిర్మాణం పూర్తయి నెలలు కావొస్తుంది. అధికారులు ప్రారంభించేందుకు ఆలస్యం చేస్తున్నారు. పనులు పూర్తయినా ఓపెన్ చేయకపోవడం చిత్రంగా ఉంది. చిన్నారులకు విజ్ఞానాన్ని పెంచేలా తయారు చేసిన పార్కును అందుబాటులోనికి తీసుకుని రాకపోవడం దారుణం. పిల్లలు దసరా సెలవుల్లో చక్కటి విజ్ఞానాన్ని పొందే అవకాశం పోగొట్టారు.

– డా. గుబ్బల రాంబాబు, స్పిన్నింగ్ మిల్-2 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ సలహాదారుడు

పార్కు ప్రారంభించాలి



చిన్నారులకు విజ్ఞానాన్ని అందించేందుకు కోట్లాది రూపాయలతో నిర్మాణం చేపట్టిన పార్కును తక్షణమే ప్రారంభించాలి. పనులు పూర్తి స్థాయిలో పూర్తి అయ్యాయి. ప్రజలకు తక్షణమే అందుబాటులోనికి తీసుకుని రావాలి. అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించాలి.

– బీవీఎస్ఎల్‌పీ రెడ్డి, స్థానికుడు

స్వరాజ్య పోరాటంలో ప్రజల్ని చైతన్యపరచిన 'బ్రహ్మజ్యోసుల'

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోదావరి పరీవాహక ప్రాంతంలో స్వాతంత్ర సమరోద్యమంలో ప్రజలను చైతన్య పరిచిన ఘనత డా.బ్రహ్మ జ్యోసుల సుబ్రహ్మణ్యం దక్కించుకున్నారని ఆంధ్ర కేసరి యువజన సమితి కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. డా.బ్రహ్మజ్యోసుల 133వ జయంతిని సుబ్రహ్మణ్య మైదానంలో శనివారం ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామ నాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాదిరాజు మాట్లాడుతూ సీతానగరంలో ఆయన స్థాపించిన గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమం వచ్చే నెల 9వ తేదీకి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని మాదిరాజు అన్నారు. స్వరాజ్య ఉద్యమంలో తన ప్రసంగాలతో ఎంతో మందిని చైతన్య పరిచారన్నారు. మహాత్మాగాంధీ కస్తూర్బా మరణాంతరం ఆశ్రమం పేరు కస్తూర్బా ఆశ్రమంగా మార్చారన్నారు. నాడు స్వాతంత్ర పోరాటానికి పురిటిగడ్డ, ఈశ్రమంలో ఎందరో పోరాటయోధులు నివసించేవారని ఆయన అన్నారు.



బ్రహ్మజ్యోసుల సుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సభ్యులు

ఆశ్రమం నుంచి వెలువడిన కాంగ్రెస్ పత్రికకు చెందిన నలుగురు వరుస సంపాదకులు జైలు శిక్షలు అనుభవించారన్నారు. ఆ ఆశ్రమం నుంచి ఎందరో దేశభక్తులు తయారయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో క్రొవ్విడి సుబ్రహ్మణ్యం, దుర్వాసుల సత్యనారాయణ, తొక్కుల రమేష్, సాయిబాబా, సమాజ సేవకులు పి.వి.ఎస్ కృష్ణారావు, సమితి కోశాధికారి గుడిపాటి గౌతం తదితరులు పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర' సేవలు అభినందనీయం

ఐదో వసంతంలోకి స్వర్ణాంధ్ర మొబైల్ అన్నదాన సేవలు

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మొబైల్ అన్నదాన సేవా కార్యక్రమం నాలుగేళ్లు పూర్తి చేసుకుని ఐదో వసంతంలోకి ప్రవేశించిందని నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా పుష్కర ఘాట్ వద్ద జరిగిన అన్నదానం కార్యక్రమంలో రోటరీ రివర్ సిటీ క్లబ్ ప్రెసిడెంట్ నాళం నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరై భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ అవసరార్థుల కోసం స్వర్ణాంధ్ర సేవా సంస్థ చేపట్టిన ఉచిత మొబైల్ అన్నదాన కార్యక్రమం నాలుగేళ్లు పూర్తి చేసుకుని ఐదో వసంతంలోకి అడుగు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. గత రెండున్నర దశాబ్దాలుగా నగరంలోని వృద్ధులు నిరాశ్రయుల కోసం, మహిళలకు శిక్షణ ఉపాధి కల్పిస్తూ బహుముఖ సేవలందం అభినందనీయమని నరసింహారావు ప్రశంసించారు. సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూఅనాథల కోసం ఈ ఉచిత మొబైల్ భోజనం ఏర్పాటు చేశామన్నారు. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ (యు.ఎన్.ఓ) ఆకలి తీర్చండి (ఫీడ్ ద హంగర్) అనే పిలుపును అందిపుచ్చుకుని స్వర్ణాంధ్ర సేవా సంస్థ 2020 అక్టోబరు 10న ఈ అన్నదానం ప్రారంభించిందని, రోజుకు 500 మందికి భోజనం అందిస్తుందని ఆయన తెలిపారు.



అన్నదానం చేస్తున్న స్వర్ణాంధ్ర ససేవకులు

వలంటీర్ల సేవలకు సత్కారం



ఎస్పీ గంగిరెడ్డిని సత్కరిస్తున్న దేవీచౌక్ ఉత్సవ కమిటీ సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం దేవీచౌక్ వద్ద 91వ శరన్నవరాత్ర ఉత్సవాల చివరి రోజైన విజయదశమి సందర్భంగా ఆదిత్య డిగ్రీ కాలేజీల ఎన్.ఎస్.ఎస్, యువరెడ్ క్రాస్ వలంటీర్ల స్వచ్ఛంద సేవలను మెచ్చుకోవాల్సినవని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బత్తుల రాజరాజేశ్వరరావు సభ్యులు వలంటీర్ల సేవలను ప్రశంసించారు. ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డిని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వలంటీర్లను ఉత్సవ కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా నిరంతరం ఈ ఉత్సవాల్లో తమ సేవలను అందిస్తూ, భక్తుల ఇబ్బంది లేకుండా ఆదిత్య వలంటీర్లు సేవలందిస్తున్నారన్నారు. ఆదిత్య డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి నాయకత్వంలో వారి పనితీరు మరింత అభినందనీయమైందని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమ అధికారులైన డాక్టర్ జి.వి.ఎస్.నాగేశ్వరరావు, పోలుకోండ సాయి, శ్రీమతి కె.మహేశ్వరి, డాక్టర్ బి.హెచ్. వి.రమాదేవి పర్యవేక్షణలో వలంటీర్లు ఎంతో శ్రమించారు. భక్తుల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, పూజలు సజావుగా సాగేందుకు వారు చేసిన సహకారం ప్రసంశనీయమన్నారు. తమ వలంటీర్లు చేసిన సేవలకు చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సుగుణ రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్ తదితరులు వలంటీర్లకు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లను అభినందించారు.

శివప్రసాద్‌కు కళాప్రియ అవార్డు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదికపై ప్రముఖ హిందీ గాయకుడు, గాన గంధర్వ కిషోర్ కుమార్ 38వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం సాయంత్రం నట గాయకుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాప్రియ జల్లి శివప్రసాద్‌కు కళాప్రియ అవార్డు అందజేసి, ఘనంగా సత్కరించారు. కిషోర్ కుమార్ అవార్డు కూడా అందజేశారు. ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, విశిష్ట అతిథిగా బయ్యా జోసఫ్ రాజు హాజరయ్యారు. కిషోర్ కుమార్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. జిత్ మోహన్ మిత్ర మాట్లాడుతూ కిషోర్ కుమార్ భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తన గానామృతంతో పలు పాటలు పాడి చెరగని ముద్ర వేశారన్నారు. తనకు 1964నుంచి చేదోడు వాదోడుగా ఉంటున్న శివప్రసాద్‌ని కళాప్రియ అవార్డుతో సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. హర్షకుమార్, గుమ్మడి సమర్పణరావులకు తన పాటలు అంటే ఎంతో ఇష్టమని, ఆంధ్రా యూనివర్సిటీలో తన ఆర్కెస్ట్రా పెట్టించి విజయవంతం చేశారని మిత్ర గుర్తు చేసుకున్నారు.



శివప్రసాద్‌ను కళాప్రియ అవార్డుతో సత్కరిస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్, జిత్‌మోహన్ మిత్ర తదితరులు

మాజీ ఎంపీ హర్షకుమార్, గుమ్మడి సమర్పణరావు, ఏపీఎస్ ఈబీ రిటైర్డ్ ఎస్ ఈ వైఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ శివప్రసాద్‌కి కళాప్రియ అవార్డు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరిలో డా.హేమ నళిని, డా.వంక బాలకృష్ణ, హర్ష శ్రీ వైభవ్, పోస్టల్ ప్రసాద్ తదితరులు గీతాలు ఆలపించారు. కళారత్న పి.వి.ఎస్.కృష్ణారావు, సూరపురెడ్డి తాతారావు, వి.జగపతి, ఏఎస్ ఆనంద్, బి.సీతా రామారావు, సుక్కిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పక్షాన అజేయ ప్రస్థానం పీడీఎఫ్ ఎమ్మెల్సీలది

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పీడీఎఫ్ తరపు నుంచి ఇప్పటి వరకు గెలిచిన అభ్యర్థులందరూ ప్రజా పక్షాన నిలబడి శాసనమండలిలో సమస్యలపై తమ స్వరాలు సంధించారని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. త్వరలో జరగబోయే ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం ఉప ఎన్నికలో పీడీఎఫ్ నుంచి బొర్రా గోపి మూర్తిని అభ్యర్థిగా నిలబెడుతూ ఆయనను పరిచయం చేశారు. ఈ కార్యక్రమం ఆదివారం రాజమండ్రి ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో జరిగింది. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలు అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాలు మద్దతిస్తూ పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చుక్కారామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎంఎస్ శర్మ, డాక్టర్ గేయానంద్ వంటి ఔన్నత్యం గల మేధావులందరూ పీడీఎఫ్ నుంచి ఎమ్మెల్సీలుగా గెలిచి అమూల్యమైన సేవలు అందించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ఎమ్మెల్సీలకు లక్షలాది రూపాయలు విలువ గల స్థలాన్ని కేటాయిస్తే ఎమ్మెల్సీలు వాటిని స్వీకరించకపోవడం పీడీఎఫ్ ఎమ్మెల్సీల ఔన్నత్యానికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ నిర్మాణాత్మకమైన, విలువల కలిగిన ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ అన్నారు. ఉపాధ్యాయులంతా తీవ్ర కృషితో గోపి మూర్తిని గెలిపించాలని ఆయన పేర్కొన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపి మూర్తి, కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు గాంధీ, ప్రభాకర్, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా లకు చెందిన కార్యదర్శులు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అరుణ కుమారి, జయకర్, షరీఫ్, జ్యోతి బస్సు, పెంకే వెంకటేశ్వరరావు, తోటకూర చక్రవర్తి, నగేష్, అన్నారాం, విల్సన్, మహేష్ రావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి పరిచయ కార్యక్రమంలో ఐక్యత చాటుతున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

చారిటీకి పర్యాయ పదంగా నిలిచిన రతన్ టాటా



రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న సత్యచారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు, సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: భారతదేశ చరిత్రలో చారిటీకి పర్యాయ పదంగా నిలిచిన మహా మనిషి స్వర్గీయ రతన్‌టాటా అని సత్య చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు మార్ని వాసుదేవ్ కొనియాడారు. మోరంపూడి జంక్షన్‌లో టీ టైమ్ వద్ద సత్యచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అధ్యక్షుడు తమ్మారవి అధ్యక్షతన రతన్‌టాటా సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మార్ని వాసుదేవ్ మాట్లాడుతూ రతన్ టాటా భారతదేశానికి చేసిన సేవలు, పేద ప్రజలకు చేసిన చారిటీల గురించి, వారి గొప్ప మనస్తత్వం గురించి చెప్పి, వారిని ఆదర్శంగా తీసుకుని సాటి వారికి సహాయం చేయాలని పిలుపునిచ్చారు. రతన్ టాటాకు నివాళులర్పించడం భారతదేశ ప్రజలందరి బాధ్యతని ట్రస్ట్ అధ్యక్షుడు తమ్మా రవి తెలిపారు. సంస్మరణ సభలో వక్తలందరూ రతన్ టాటా గొప్పతనం గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట సొసైటీ మాజీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, వివేకానంద మహారోగి ఆరోగ్యం కేంద్రం అధ్యక్షుడు రిమ్మలపూడి సుబ్బరాజు, సత్యాచారిటబుల్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు ఎస్.రాయుడు, ట్రెజరర్ ఎం.సూర్య, ఎగ్జిక్యూటివ్ కమిటీ ఇన్‌చార్జి పి.పద్మరాజు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ మానవత సంస్థ మాజీ అధ్యక్షుడు బూరగడ్డ మురళి, ట్రస్టు సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన శరన్నవరాత్రులు

- ఆఖరి రోజు రాజరాజేశ్వరీదేవి అవతారం
- అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లో విజయకనకదుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలను ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను, లలితాదేవి దంపతులు అభిషేకాలు చేశారు. రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చిన అమ్మవారిని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మాజీ డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు, సాయినగర్ అధ్యక్షుడు రామకృష్ణ, భక్తులు హాజరై దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బొమ్మూరులోని బాలాజీపేట సెంటర్‌లో విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, వాసంశెట్టి సూర్యగణేష్,తలారి శ్రీనివాసరావు, సూరంపూడి ప్రకాష్ పాల్గొన్నారు. తొర్రేడు గ్రామంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. భక్తుల రాకతో ఓనువులమ్మ ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



మోరంపూడి సాయినగర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న జక్కంపూడి విజయలక్ష్మి

ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారీగా ఊరేగింపులు

కడియం: శరన్నవరాత్ర ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు మండలంలో జోరుగా సాగాయి. మండలంలో వేమగిరి, కడియం, దుళ్ల, కడియపులంక తదితర గ్రామాల్లో అమ్మవారిని మేళతాళాలు, వివిధ సంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. యువత పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. కడియం పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాటు పర్యవేక్షించారు.

దసరా వేడుకల్లో మంత్రి దుర్గేష్

కడియం: మండలంలోని మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దసరా వేడుకల్లో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొన్నారు. గ్రామంలో భువనేశ్వరి సమేత చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చంటి దంపతులు సమకూర్చిన బంగారు హారాన్ని అలంకరించారు.



దేవిచౌక్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి దంపతులు

దేవీచౌక్‌లో..

ప్రకాశం నగర్: శరన్నవరాత్ర మహోత్సవాల్లో చివరి రోజైన దేవీచౌక్‌లో కొలువై ఉన్న బాలా త్రిపుర సుందరి అమ్మవారిని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, డిల్లీ రావు దంపతులు, కుమార్తె సిరి చందన, కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు పూర్ణకుంభంతో కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ఆరోగ్యవంతంగా భోగభాగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కోరుకొండ రోడ్డులోని కనకదుర్గ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న, జిల్లా జడ్జి గంధం సునీత

కోరుకొండ రోడ్డులోని కనకదుర్గ ఆలయంలో..

కోరుకొండ రోడ్డులోని శ్రీసాయి కనకదుర్గ ఆలయంలో జిల్లా జడ్జి గంధం సునీత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి గంధం సునీత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు దుద్దిపూడి శ్రీనివాస్, పద్మావతి, మాజీ కార్పొరేటర్లు కంటిపూడి పద్మావతి శ్రీనివాస్, ఆకుల రాజు, జొన్నాడ దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

కలప వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించారు.

స్థానిక సరస్వతి ఘాట్‌లో ఉన్న జ్ఞాన సరస్వతి పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.